క్లుప్తంగా

స్వర్ణ పుష్పాలంకరణలో పైడితల్లి



స్వర్ణ పుష్పాలంకరణలో పైడితల్లి

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి పైడితల్లి అమ్మవారు శుక్రవారం స్వర్ణపుష్పాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఏడిద రమణ ఆధ్వర్యంలో అర్చకులు అమ్మవారికి స్వర్ణపుష్పాలతో పూజలు నిర్వహించి, సర్వాంగ సుందరంగా అలంకరించారు. భక్తులు అమ్మవారిని దర్శించి పసుపు, కుంకుమలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమాలను ఆలయ ఈఓ ప్రసాద్ పర్యవేక్షించారు.

వైద్యవృత్తిపై అవగాహన

పూసపాటిరేగ: మండలంలోని కుమిలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు వృత్తివిద్యా శిక్షణ ఇస్తున్నట్లు పాఠశాల హెచ్ఎం శ్రీదేవి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక రెల్లివలస ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని సందర్శించి వైద్యవృత్తిపై శిక్షణ పొందారని చెప్పారు. స్వయం ఉపాధి సాధించడానికి వృత్తివిద్యా కోర్సులు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌స్ట్రక్టర్ సూర్యకుమారి, తదితరులు ఉన్నారు.

సందర్శన



మూల్యాంకన కేంద్రం ప్రాంగణంలో ఉపాధ్యాయులను పలకరిస్తున్న ఎమ్మెల్సీ గాదె

విజయనగరం అర్బన్: పట్టణంలోని సెయింట్ జోసఫ్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న పదో తరగతి వార్షిక పరీక్షల ప్రశ్నపత్రాల మూల్యాంకన ప్రక్రియ కేంద్రాన్ని ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ డాక్టర్ గాదె శ్రీనివాసులనాయుడు శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులకు కల్పించిన సౌకర్యాలపై ఆరా తీశారు. ఆయన వెంట పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి డి.శ్రీనివాస్, ఉత్తరాంధ్ర మీడియా ఇన్‌చార్జ్ బంకపల్లి శివప్రసాద్, సంఘ పట్టణ అధ్యక్షుడు చిట్టి రామినాయుడు, శివసూర్యనారాయణ, రంధి శ్రీను, వర్రి అవతారం, అల్లు మురళి, తదితరులున్నారు.

వక్ఫ్‌బోర్డులో సవరణలు రాజ్యాంగ విరుద్ధం

విజయనగరం గంటస్తంభం: వక్ఫ్‌బోర్డులో సవరణలు లౌకిక, రాజ్యాంగ, ప్రజాస్వామ్య సూత్రాలకు విరుద్ధమని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు ఎ.జగన్ మోహనరావు అన్నారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శుక్రవారం స్థానిక మూడులాంతర్ల మసీదు వద్ద ముస్లిం సోదరులకు, పెద్దలకు కరపత్రాల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వక్ఫ్‌బోర్డు మాజీ వైస్ ప్రెసిడెంట్ ఖాదర్ బాద్‌షా, పెద్దలు అన్సార్ మాట్లాడుతూ.. సీపీఎం చేస్తున్న ఈ ప్రయత్నాన్ని అభినందిస్తున్నామన్నారు. ఇప్పటికే వక్ఫ్ బోర్డు ఆస్తులు అన్యాక్రాంతం అవుతున్నాయని, ఈ సవరణలతో మరింత నష్టం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. 1961లో ఉత్తరాంధ్ర జిల్లాల్లో గల వక్ఫ్ బోర్డు ఆస్తులపై ప్రాపర్టీ గెజిట్ నోటిఫికేషన్ ఇచ్చారని, ఆ సర్వేలో పేర్కొన్న విధంగా చూస్తే చాలా ఆస్తులు అన్యాక్రాంతమయ్యాయని ఆరోపించారు. వక్ఫ్‌బోర్డుకి బీజేపీ ప్రభుత్వం చేసిన సవరణలతో మరింత ప్రమాదం పొంచి ఉందన్నారు.

ఓటర్ల జాబితా తయారీకి సహకరించండి



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ సుదర్శనరావు

నెల్లిమర్ల: స్థానిక రెవెన్యూ కార్యాలయంలో నియోజకవర్గానికి చెందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఏఈఆర్‌ఓ, తహసీల్దార్ సుదర్శనరావు శుక్రవారం సమావేశం నిర్వహించారు. నియోజకవర్గానికి సంబంధించి మెరుగైన ఓటర్ల జాబితా తయారీకి సహకరించాలని కోరారు. జాబితాలో మార్పులు, చేర్పులు చేపట్టేందుకు సలహాలు, సూచనలు అందించాలన్నారు. అలాగే పోలింగ్ స్టేషన్ల గుర్తింపునకు కూడా సహకారం అందించాలన్నారు. సమావేశంలో టీడీపీ నాయకులు కంది చంద్రశేఖరరావు, గేదెల రాజారావు, ఎన్నికల డీటీ జగన్నాథరావు, సీనియర్ అసిస్టెంట్ ప్రసన్నకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా సాయి మందిర వార్షికోత్సవం

డెంకాడ: పినతాడివాడలో సాయి మందిరం వార్షికోత్సం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఓంకారం, సుప్రభాతం, నగర సంకీర్తన కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం సత్యసాయి సేవా సమితి జిల్లా అధ్యక్షుడు వీవీఎస్ఎస్ సునీల్‌కుమార్ రాథో ప్రశాంతి పతాకావిష్కరణ చేశారు. పూజా కార్యక్రమాల్లో లెంక లక్ష్మణరావు, వి. అచ్చెన్నాయుడు, పి. భాస్కరరావు, కె. ఆదిత్య, వి. వెంకటరావు, ఆర్. అప్పలనాయుడు, చిన్నంనాయుడు, వర్మరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఖాళీ స్థలాలు.. అపరిశుభ్రతకు నిలయాలు



- వ్యర్థాలు, ముళ్ల చెట్లతో నగర వాసుల ఇబ్బందులు
- ఏడాదికేడాదికి పెరిగిపోతున్న ఖాళీ స్థలాల పన్ను బకాయిలు
- దృష్టి సారించని కార్పొరేషన్ అధికారులు

విజయనగరం: విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 50 డివిజన్లు ఉండగా.. అధికారిక లెక్కల ప్రకారం 70,293 అసెస్‌మెంట్లు ఉన్నాయి. ఖాళీ స్థలాలు మరో 2,780 ఉండగా.. వీటన్నింటికీ అధికారులు పన్ను వేస్తున్నారు. అయితే అనధికారికంగా మరో రెండు వేలకు పైచిలుకు ఖాళీ స్థలాలు ఉంటాయని అంచనా. వీటి వల్ల ప్రజల అవస్థలు వర్ణనాతీతం. ఖాళీ స్థలాల్లో పెరిగిన ముళ్ల చెట్లు, అక్కడ పడేస్తున్న చెత్తతో సమీప ప్రాంతాల్లో ఉంటున్న వారి పరిస్థితి అగమ్యగోచరంగా మారింది.

పారిశుధ్యం అధ్వానం..

కార్పొరేషన్ పరిధిలోని నివాసాల మధ్య ఉన్న ఖాళీ స్థలాల్లో పారిశుధ్యం అధ్వానంగా మారింది. ఏళ్ల తరబడి ఖాళీగా ఉన్న స్థలాల్లో పిచ్చిమొక్కలు, వ్యర్థాలు పేరుకుపోవడంతో సమీప ప్రాంతాల్లో ఉంటున్న ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. యజమానులు ఖాళీ స్థలాలను పట్టించుకోకపోవడంతో.. మినీ డంపింగ్ యార్డుల్లా మారుతున్నాయి. వందల ఎకరాల్లో ఖాళీ స్థలాలున్నాయి. దీంతో దోమల బెడద, దుర్వాసనతో స్థానికులకు అవస్థలు తప్పడం లేదు. ఖాళీ స్థలాల యజమానులకు నోటీసులు జారీ చేసి.. పరిశుభ్రంగా మార్చాల్సిన బాధ్యత మున్సిపల్ శాఖ అధికారులపై ఉన్నా ఆ దిశగా తీసుకుంటున్న చర్యలు శూన్యం. అయితే సంబంధిత యజమానులు ఎక్కడ ఉంటున్నారో తెలియని పరిస్థితిలో చాలా మందికి నోటీసులు కూడా అందించలేని పరిస్థితి నెలకొంది.

తూతూమంత్రంగా సేవలు..

విజయనగరంలో 400కు పైగా వీధులుండగా.. ప్రతి వీధిలోనూ సగటున నాలుగు చోట్ల ఖాళీ స్థలాలు ఇళ్ల మధ్యన ఉన్నాయి. కార్పొరేషన్ అధికారిక లెక్కల ప్రకారం 2780 ఖాళీ స్థలాలకు పన్ను విధిస్తున్నారు. వీటికి సంబంధించి ప్రభుత్వ నిబంధనల ప్రకారం డాక్యుమెంట్ రిజిస్ట్రేషన్ విలువలో 0.2 శాతం పన్ను నిర్ణయిస్తారు. ఈ మేరకు విజయనగరం కార్పొరేషన్ పరిధిలో పాత బకాయిలు రూ.7.50 కోట్లు, ముగిసిన ఆర్థిక సంవత్సరంలో వసూలు చేయాల్సింది రూ.4.39 కోట్లు కలిపి మొత్తంగా రూ.11.90 కోట్లు వసూలు చేయాల్సి ఉంది. అయితే ఆర్థిక సంవత్సరం ముగిసేలోగా అధికారులు వసూలు చేసింది మొత్తంగా రూ. 4.24 కోట్లు మాత్రమే. మరో రూ.7.66 కోట్ల బకాయిలున్నాయి. దీనికి తోడు ఖాళీ స్థలాల్లో పారిశుధ్య పనులు చేపట్టకపోవడంతో ఆస్తి పన్ను చెల్లిస్తున్న ప్రజలు ఇదేం ఖర్మ అని వాపోతున్నారు. ఇవి కాకుండా పన్ను పరిధిలోకి రాని వాటిని గుర్తించి పన్ను విధిస్తే అటు కార్పొరేషన్‌కు ఆదాయంతో పాటు ఖాళీ స్థలాల్లో ఎప్పటికప్పుడు పారిశుధ్య పనులు చేపట్టే అవకాశం ఉంది. తద్వారా ప్రజలకు ఇబ్బంది ఉండదు.

పన్నులు చెల్లించాలి..

ఖాళీ స్థలాల యజమానులను గుర్తించి పన్ను వసూలు చేసే దిశగా చర్యలు చేపడుతున్నాం. పన్ను చెల్లించడం ద్వారా అటు స్థల యజమానికి భవిష్యత్‌లో ఏ సమస్య వచ్చినా పరిష్కరించుకోవచ్చు. అదే సమయంలో కార్పొరేషన్‌కు ఆదాయం సమకూరి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు వీలుంటుంది.

– పి.నల్లనయ్య, కమిషనర్, విజయనగరం కార్పొరేషన్

నడకతో సంపూర్ణ ఆరోగ్యం



విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న నిర్వాహకులు

విజయనగరం: నడకతో పరిపూర్ణ ఆరోగ్యం సాధ్యమని, నడక నాలుగు విధాలుగా మేలని ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ సంఘం విజయనగరం జిల్లా శాఖ మహిళా విభాగం అధ్యక్షురాలు, స్థానిక కార్పొరేటర్ పిన్నింటి కళావతి అన్నారు. సంఘ జిల్లా అధ్యక్షుడు సముద్రాల గురుప్రసాద్ ఆధ్వర్యంలో జాతీయ నడక దినోత్సవం సందర్భంగా అలకానంద కాలనీలో గల పార్క్‌లో శుక్రవారం నడకల పోటీలు నిర్వహించారు. 70 సంవత్సరాలకు పైబడిన విభాగంలో పి. మాధవరావు, ఎస్. అంజిబాబు, పి. కృష్ణారావు విజేతలుగా నిలిచారు. 60 నుంచి 70 సంవత్సరాల విభాగంలో టి. చిన్నారావు, వి. కాశీనాయుడు, వై. ఆదినారాయణ మొదటి మూడు స్థానాలు సాధించారు. విజేతలకు కుసుమంచి ఫౌండేషన్ అధ్యక్షుడు సుబ్బారావు, తోష్నీవాలా వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు వెత్సా సత్యనారాయణమూర్తి, నాలుగెస్సుల రాజు, సంఘం ఉపాధ్యక్షుడు పిన్నింటి సూర్యనారాయణ, నెల్లిమర్ల మండల విద్యా శాఖాధికారి ఈపు విజయ్‌కుమార్ బహుమతులు అందజేశారు.

9న జెడ్పీ సర్వసభ్య సమావేశం

విజయనగరం రూరల్: ఈ నెల 9న జిల్లా సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు జెడ్పీ సీఈఓ బీవీ సత్యనారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఉదయం 11 గంటలకు నిర్వహించనున్న సమావేశానికి సభ్యులందరూ హాజరుకావాలని కోరారు.

శిక్షణ సదస్సు

నెల్లిమర్ల: మండలంలోని పలు గ్రామాలకు చెందిన ఎన్యుమరేటర్లకు శుక్రవారం స్థానిక వెలుగు కార్యాలయంలో జీవనోపాధుల పెట్టుబడిపై శిక్షణ సదస్సు నిర్వహిచారు. శిక్షణ పొందిన ఎన్యుమరేటర్లు ఆయా గ్రామాల్లోని డ్వాక్రా సంఘాలు ఎంత మొత్తంలో రుణాలు తీసుకున్నాయి..? ఆ రుణాలతో ఏమేం వ్యాపారాలు చేశారు..? తదితర వివరాలు సేకరించాలని ఏపీఎంలు సురేష్‌కుమార్, పద్మ తెలిపారు. డ్వాక్రా మహిళల జీవనోపాధి మరింత మెరుగుపరచడానికి శిక్షణ ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో సీసీలు, వీఓఏలు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ

నెల్లిమర్ల: ఉపాధిహామీ పథకం మండల ఏపీఓగా చప్పా రామారావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. గజపతినగరం నుంచి ఆయన ఇక్కడికి బదిలీపై వచ్చారు. అలాగే ఇంజినీరింగ్ కన్సల్టెంట్‌గా కె. యుగేష్ బదిలీపై ఇక్కడికి విచ్చేశారు. వారితో పాటు నలుగురు కొత్త టెక్నికల్ అసిస్టెంట్లు కూడా బాధ్యతలు స్వీకరించారు. ఇంతవరకు ఇక్కడ పనిచేసిన ఏపీఓ, ఇంజినీరింగ్ కన్సల్టెంట్‌లకు బొండపల్లి మండలానికి బదిలీపై వెళ్లారు.

దోమల నివారణకు చర్యలు

విజయనగరం: నగరంలో దోమల నివారణ చర్యలు తీసుకుంటున్నామని, ప్రజలు కూడా తగిన సహకారాన్ని అందించాలని విజయనగరం కార్పొరేషన్ ప్రజారోగ్యాధికారి సాంబమూర్తి తెలిపారు. నగర వ్యాప్తంగా ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజారోగ్యాధికారి సాంబమూర్తి మాట్లాడుతూ.. దోమల నివారణ ఎంత ముఖ్యమో, నిరోధించడం కూడా అంతే ముఖ్యమన్నారు. ఇందుకోసం దోమల వృద్ధి కేంద్రాలను గుర్తించి వాటిని నియంత్రించాలని సూచించారు. ఇంటి పరిసర ప్రాంతాల్లో మురుగునీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. లార్వా దశలోనే వాటిని తొలగిస్తే దోమలు కొంతవరకు తగ్గుముఖం పడతాయన్నారు.

ఆర్థిక సాయం

పూసపాటిరేగ: మండలంలోని కొవ్వాడ గ్రామానికి చెందిన పప్పల సూర్యనారాయణకు క్యాన్సర్ సోకడంతో పలువురు ప్రజాప్రతినిధులు రూ. 40 వేల ఆర్థిక సాయాన్ని శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో కొవ్వాడ సర్పంచ్ కోట్ల రఘు, ప్రజాప్రతినిధులు పతివాడ శ్రీనివాసరావు, శంకాబత్తుల సత్తిబాబు, దేశెట్టి గణేష్, జమరాజు, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఆలయ ప్రారంభోత్సవం



పూజల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని సతివాడ గ్రామంలో కోదండరామస్వామి ఆలయ ప్రారంభోత్సవాలు శుక్రవారంతో వైభవంగా ముగిశాయి. వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన వేద పండితుల ఆధ్వర్యంలో గడిచిన నాలుగు రోజుల నుంచి నిర్విరామంగా విశేష పూజలు జరిపించారు. వేకువజామున విగ్రహ ప్రతిష్ట, శిఖర ప్రతిష్టాపన కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయాన్ని మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు సందర్శించి స్వామిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు గదల సన్యాసినాయుడు, సర్పంచ్ రేవళ్ల శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యుడు రెడ్డి సత్యనారాయణ, నాయకులు జమ్ము అప్పలనాయుడు, పప్పల భాస్కరరావు, చనమళ్ల తులసి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

రేషన్ డిపోలు తెరవకపోతే చర్యలు

- జాతీయ ఆహార భద్రత కమిషన్ సభ్యుడు కాంతారావు



అంగన్‌వాడీ కేంద్రంలో రికార్డులు పరిశీలిస్తున్న కాంతారావు

విజయనగరం ఫోర్ట్: రేషన్ డిపోలు సకాలంలో తెరవకపోతే ఉపేక్షించేది లేదని జాతీయ ఆహార భద్రత కమిషన్ సభ్యుడు కాంతారావు అన్నారు. పట్టణంలో పలు రేషన్ డిపోలను శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. 11వ నంబర్ రేషన్ డిపోను ముందుగా పరిశీలించగా.. సకాలంలో తెరవకపోవడం, సరుకుల్లో వ్యత్యాసం ఉండడంతో సీఎస్‌డీటీపై మండిపడ్డారు. 14వ నంబర్ రేషన్ డిపోలో ఆక్సిజన్ సిలిండర్లు ఉండడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ రెండు డిపోలపై చర్యలు తీసుకోవాలని డీఎస్‌ఓ మధుసూదనరావును ఆదేశించారు. 11వ నంబర్ రేషన్ డిపోకు చెందిన ఎండీయూ వాహనాన్ని సీజ్ చేసి తహసీల్దార్ కార్యాలయానికి తరలించాలని ఆదేశించారు. అనంతరం పలు అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. పర్యటనలో స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారి రుక్సానా సుల్తానా బేగమ్, సీడీపీఓ జి.ప్రసన్న, సీఎస్‌డీటీ రామారావు, తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన ఫలితాలు సాధించాలి

- మున్సిపల్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సురేష్‌కుమార్



వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన కమిషనర్, ఇతర అధికారులు

విజయనగరం: ప్రభుత్వం నిర్దేశించిన ప్రాధాన్యతాంశాలను శతశాతం అమలు చేసి పురపాలనలో మెరుగైన ఫలితాలు సాధించాలని మున్సిపల్ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ సురేష్‌కుమార్ అధికారులకు దిశానిర్దేశం చేశారు. అమరావతి నుంచి గురువారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పలు అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. ముఖ్యంగా నగరంలో ఎక్కడా తాగునీటికి ఇబ్బందుల్లేకుండా చూడాలని ఆదేశించారు. ముందస్తుగానే నీటి పంపిణీకి అవసరమైన ప్రణాళికలను సిద్ధం చేసుకుని, అమలు చేయాలన్నారు. అన్నా క్యాంటీన్ల ఔన్నత్యాన్ని మరింత పెంచాలని చెప్పారు. ఇంటింటి చెత్త సేకరణ శతశాతం జరిగేలా చూడాలన్నారు. చెత్తను వర్గీకరించి ప్రతి ఇంటి నుంచి సేకరించినట్లయితే నగరాలు పరిశుభ్రంగా ఉంటాయని సూచించారు. అలాగే రెవెన్యూ వసూళ్లను వేగవంతం చేయాలన్నారు. ఆస్తి, నీరు, ఖాళీ స్థలాల పన్నులను త్వరితగతిన వసూలు చేసి లక్ష్యాలను అధిగమించాలని ఆదేశించారు. సమావేశంలో కార్పొరేషన్ కమిషనర్ నల్లనయ్య, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

బెల్ట్ షాపులను ప్రభుత్వమే ప్రోత్సహిస్తోంది..



ముఖ్యమంత్రికి రాసిన లేఖను చూపిస్తున్న భీశెట్టి బాబ్జీ, తదితరులు

విజయనగరం గంటస్తంభం: గ్రామాల్లో బెల్ట్‌షాపులు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయని, ప్రభుత్వమే మద్యం అమ్మకాలను ప్రోత్సహిస్తోందని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ ఆరోపించారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి చంద్రబాబు చెబుతున్నదొకటి, చేస్తున్నది మరొకటని ఆరోపించారు. అందుకే ముఖ్యమంత్రి చంద్రబాబుకు పార్టీ తరఫున రాసిన లేఖను విడుదల చేశారు. రాష్ట్రంలో సుమారు మూడు వేల మద్యం షాపులున్నాయని.. వాటి ద్వారా 2025 – 26లో మద్యం విక్రయాల ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి రూ.27 వేల కోట్ల ఆదాయం వస్తోందని ప్రభుత్వం అంచనా వేసిందన్నారు. నిబంధనలకు విరుద్ధంగా వెలుస్తున్న బెల్ట్‌షాపులను రద్దు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. పర్యవేక్షణ చేయాల్సిన ఎక్సైజ్, పోలీస్ అధికారులు ప్రేక్షకపాత్ర పోషిస్తున్నారని ఆరోపించారు. ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి స్పందించి బెల్ట్ షాపుల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పార్టీ నాయకులు అల్లంశెట్టి నాగభూషణం, రాజు, రమేష్, పౌరవేదిక ప్రతినిధులు జలంత్రి రామచంద్రరాజు, గోపి, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన వార్షికోత్సవాలు



కళాశాల అభివృద్ధి సావనీర్‌ను విడుదల చేస్తున్న యూనివర్సిటీ ఇన్‌చార్జ్ వీసీ రాజ్యలక్ష్మి, తదితరులు

విజయనగరం అర్బన్: జేఎన్‌టీయూ గురజాడ విజయనగరం (జీవీ) పరిధిలోని యూనివర్సిటీ ఇంజినీరింగ్ కళాశాలలో రెండు రోజులుగా జరుగుతున్న క్రీడోత్సవ, వార్షికోత్సవాలు శుక్రవారంతో ముగిశాయి. తొలుత విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సింబోసిస్ టెక్నాలజీ సీఈఓ ఓ.నరేష్‌కుమార్ మాట్లాడుతూ... యూనివర్సిటీ అందిస్తున్న ఉత్తమ బోధనా నైపుణ్యాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. యూనివర్సిటీ ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ డి.రాజ్యలక్ష్మి మాట్లాడుతూ.. కష్టపడి చదివి ఉన్నత ఉద్యోగాలు సాధించిన వారు అభినందనీయులని కొనియాడారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఆర్.రాజేశ్వరరావు కళాశాల అభివృద్ధి సావనీర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి.జయసుమ, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పుస్తకాల పంపిణీ



నెల్లిమర్ల పట్టణంలోని సీకేఎం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుతున్న ఇంటర్ విద్యార్థులకు శుక్రవారం పుస్తకాలు పంపిణీ చేశారు. సీనియర్ ఇంటర్మీడియట్ చదువుతున్న 342 మంది విద్యార్థులకు ప్రభుత్వం సరఫరా చేసిన పాఠ్య పుస్తకాలతో పాటు ఒక్కొక్కరికి 12 చొప్పున నోట్ పుస్తకాలను ప్రిన్సిపాల్ మజ్జి సత్యనారాయణ అందజేశారు. కళాశాలలో త్వరలో నిర్వహించే తరగతులను దృష్టిలో పెట్టుకుని ఈ ఏడాది ముందుగానే పుస్తకాలు అందజేసినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

– నెల్లిమర్ల

వితరణ..



ప్రమాదాల నివారణ కోసం ఏర్పాటు చేసే స్టాపర్లను జొన్నాడ వద్ద ఉన్న లెండి ఇంజినీరింగ్ కళాశాల యాజమాన్యం పోలీసులకు వితరణగా అందించింది. వీటిని భోగాపురం సీఐ రామకృష్ణ, ఎస్సై ఎ.సన్యాసినాయుడు శుక్రవారం పరిశీలించారు. ప్రమాదాలకు ఎక్కువగా ఆస్కారం ఉన్న ప్రాంతాల్లో వీటిని ఏర్పాటు చేస్తున్నారు. దీనిలో భాగంగా విజయనగరం – విశాఖ రహదారిపై పలు చోట్ల ఈ స్టాపర్లను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ టి.హరిబాబు, పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు సన్యాసినాయుడు, ఆర్అండ్‌బీ జేఈ అయినాడ, చింతలవలస జంక్షన్ ప్రాంతాలను పరిశీలించారు.

– డెంకాడ

సహస్ర దీపాలంకరణ



సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం సీతారామస్వామి వారి దేవస్థానంలో సహస్ర దీపాలంకరణ కార్యక్రమాన్ని ఆలయ అర్చకులు శుక్రవారం కనులపండువగా జరిపించారు. వెండి మండపంలో ఉన్న సీతారామస్వామి ఉత్సవ విగ్రహాలను మంగళవాయిద్యాలు, వేద మంత్రోచ్చారణల నడుమ ఊరేగింపుగా తీసుకువచ్చి, దీపారాధన మండపంలో ఉన్న ప్రత్యేక ఊయలలో ఉంచారు. అనంతరం సహస్ర దీపాల శోభలో సీతారామస్వామికి ఊంజల్ సేవ జరిపించారు. కార్యక్రమంలో అర్చకులు, దేవస్థాన సిబ్బంది పాల్గొన్నారు.

– నెల్లిమర్ల రూరల్

చిన్నారుల సంక్షేమమే లక్ష్యం..



చిన్నారుల సంక్షేమమే మిషన్ వాత్సల్య లక్ష్యమని అధికారులు అన్నారు. నగరంలోని అన్ని సచివాలయాల పరిధిలో మిషన్ వాత్సల్య సమావేశాలు శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేషన్ కమిషనర్ నల్లనయ్య మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త నిర్వహణలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. చిన్నారుల రక్షణ వ్యవస్థ బలోపేతం చేయడం, కుటుంబ ఆధారిత సంరక్షణను ప్రోత్సహించడం మిషన్ లక్ష్యమన్నారు.

– విజయనగరం

ఘనంగా ఫార్మసీ కళాశాల వార్షికోత్సవం



ప్రతిభ చూపిన విద్యార్థులకు జ్ఞాపికలు అందజేస్తున్న అతిథులు

విజయనగరం అర్బన్: మహారాజా కాలేజ్ ఆఫ్ ఫార్మసీ 21వ వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మాన్సాస్ విద్యాసంస్థల చైర్మన్ ప్రొఫెసర్ కేవీఎల్ రాజు జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోగులకు, డాక్టర్లకు మధ్య వారధిగా ఫార్మసిస్టులు ఉండాలన్నారు. విద్యాసంవత్సరంలో ప్రతిభ చూపిన పలువురు విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు అందజేశారు. అనంతరం విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎం.రామయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో గౌరవ అతిథిగా ఎపిటోరియా ఫార్మా ప్రైవేట్ లిమిటెడ్ హెచ్ఆర్ అండ్ అడ్మిన్ కమలాకర్ రెడ్డి హాజరయ్యారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ రేపు



ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న ఆలయ కమిటీ అధ్యక్షుడు పువ్వాడ శోభన్ ప్రకాష్, తదితరులు

విజయనగరం టౌన్: పట్టణంలోని కొత్తఅగ్రహారం బూర్లిపేటలో ఈ నెల 6వ తేదీన హనుమత్ లక్ష్మణ సమేత రామచంద్రమూర్తి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలు చేపట్టనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు పువ్వాడ శోభన్ ప్రకాష్ తెలిపారు. ఈ మేరకు ఆలయ ప్రాంగణంలో ఆహ్వాన పత్రికలను శుక్రవారం ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మూడు రోజుల పాటు విశేష హోమాలు, జలాధివాసం, మూర్తి కుంభప్రోక్షన, సీతారాముల శాంతి కళ్యాణం, పట్టాభిషేకాలు చేపడతామన్నారు. భక్తులందరూ పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో పువ్వాడ శ్రీహరి, మడిపల్లి రామారావు, తదితరులు పాల్గొన్నారు.

అనుమతులు తప్పనిసరి

- కమిషనర్ నల్లనయ్య



కొలతలు పరిశీలిస్తున్న కమిషనర్ నల్లనయ్య

విజయనగరం: ఇళ్లు, బహుళ అంతస్తుల నిర్మాణాలకు అనుమతులు తప్పనిసరని విజయనగరం కార్పొరేషన్ కమిషనర్ పల్లి నల్లనయ్య స్పష్టం చేశారు. నగరంలోని వివిధ ప్రాంతాలలో నిర్మాణాలు జరుగుతున్న భవనాలను ప్రణాళిక విభాగం సిబ్బందితో కలిసి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా భవనం కొలతలను దగ్గరుండి గమనించారు. అలాగే పలు ప్రాంతాల్లో పారిశుధ్య నిర్వహణ పనులను పర్యవేక్షించారు. అంబటిసత్రం వద్ద ప్రధాన కాలువలో పూడిక చేరడాన్ని గమనించి వెంటనే తొలగించాలని అక్కడున్న ప్రజారోగ్య సిబ్బందిని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నగర క్రమబద్ధీకరణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. భవనాలపై అనధికారికంగా ఎటువంటి హోర్డింగులు ఏర్పాటు చేసినా ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. కార్యక్రమంలో టీపీఎస్ అనిత, ప్రణాళికా కార్యదర్శులు పాల్గొన్నారు.